'లంగర్‌ఖానా' భూములు అన్యాక్రాంతం



సంతపేట ఎర్రచెరువు సమీపంలో లంగర్‌ఖానా సత్రం భూములలో దేవదాయశాఖ ఏర్పాటు చేసిన దిమ్మె

- దేవదాయశాఖ భూములపై వ్యాపారుల కన్ను
- సాగు రైతుల నుంచి దర్జాగా కొనుగోలు
- వ్యాపార కేంద్రాలుగా వ్యవసాయ భూములు
- అంతంతమాత్రంగా అధికారుల పర్యవేక్షణ



నమ్మివానిపేట సమీపంలో ఆక్రమణదారులు దిమ్మెను విరగ్గొట్టడంతో ఏర్పాటు చేసిన మరొక దిమ్మె

తగరపువలస: సంగివలస కొత్తమ్మ (పోలమాంబ) అమ్మవారి ఆలయ ఈవో పరిధిలోని లంగర్‌ఖానా భూములు అన్యాక్రాంతమవుతున్నాయి. దేవదాయశాఖకు చెందిన ఈ భూములను కొందరు రైతులు వ్యాపారులకు విక్రయించేయడం చర్చనీయాంశమైంది. చిట్టివలస సర్వే నంబర్ 61/1లో 67 ఎకరాలు, 61/3లో 87 సెంట్ల భూములు వందల ఏళ్ల క్రితమే దేవదాయశాఖకు దఖలు పడ్డాయి. చిల్లపేట, జీరుపేట, తగరపువలస, చిట్టివలస గ్రామాలకు చెందిన వందలాది మంది రైతులు ఈ మెట్ట భూములను సాగు చేసుకుంటూ 30 ఏళ్ల క్రితం వరకు దేవదాయశాఖకు శిస్తు చెల్లించేవారు. తరువాత ఒక్కొక్కరు వ్యవసాయం మానివేసిన తరువాత, శిస్తు చెల్లించడం మానేశారు.

హెచ్చరికల బోర్డులు తీసేస్తున్నారు

అడపాదడపా దేవదాయశాఖ సిబ్బంది లంగర్‌ఖానా భూములలో హెచ్చరికల బోర్డులు ఏర్పాటు చేసినా, రైతులు వీటిని తీసేసి, వాటి ఆనవాళ్లు కూడా లేకుండా చేశారు. దీంతో తరువాతి కాలంలో లంగర్‌ఖానా భూముల హద్దులలో కాంక్రీట్ దిమ్మెలు ఏర్పాటు చేశారు, అయితే వాటిని కూడా చాలావరకు కూల్చివేయగలిగారు. ప్రస్తుతం దేవదాయశాఖ సిబ్బంది లంగర్‌ఖానా భూములపై పూర్తిగా నియంత్రణ కోల్పోవడంతో చాలావరకు అనధికారంగా విక్రయాలు జరిగిపోతున్నాయి. ఎవరైనా ఫిర్యాదు చేసినా ఈ భూములను గుర్తించలేని పరిస్థితుల్లో ఇక్కడి సిబ్బంది ఉన్నారు. దీంతో కొందరు చిల్లర నాయకులు లంగర్‌ఖానా భూములకు శాశ్వతంగా పట్టాలు ఇప్పిస్తామని రైతులను మోసగిస్తున్నారు. దేవదాయశాఖ ఇప్పటికైనా మేల్కొని సర్వే చేయించి మళ్లీ హద్దులు నిర్ణయించకపోతే మిగిలిన భూములు కూడా చేతులు మారే ప్రమాదం ఉంది.

రైతులందరికీ నోటీసులు ఇస్తాం

గతంలో రైతులను శిస్తులు కట్టమని మా సిబ్బంది అడిగితే ఎవరూ ముందుకు రాలేదు. భూములు విక్రయానికి గురవుతున్నట్టు మా దృష్టికి వచ్చింది. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి సర్వే చేయిస్తాం. అన్యాక్రాంతం అవుతున్న భూముల రైతులతో పాటు అందరికీ 83 నంబరు నోటీసులు ఇస్తాం. అవసరమైతే పోలీసులకు ఫిర్యాదు చేస్తాం. లంగర్‌ఖానా భూములను మాత్రం అన్యాక్రాంతం కానీయం.

–బి.ప్రసాద్, ఈవో, సంగివలస కొత్తమ్మ ఆలయం

పక్కా భవనాల నిర్మాణం

కొందరు రైతులు వ్యవసాయం మానేసిన తరువాత ఈ లంగర్‌ఖానా భూములను భీమిలి మున్సిపాల్టీ, జీవీఎంసీలో విలీనం కానంత వరకు విక్రయించడం మొదలు పెట్టారు. అనుకున్న ధరలు రాకపోవడంతో మిగిలిన రైతులు తమవద్దే అట్టి పెట్టుకున్నారు. ఈ భూములను కొనుగోలు చేసిన వ్యాపారులు పక్కా భవనాలు నిర్మించి విద్యుత్ మీటర్లు, బోరుబావులు తవ్వించి వ్యవసాయ భూములను వ్యాపార కేంద్రాలుగా మార్చేసుకున్నారు. దేవదాయశాఖ ఉద్యోగులు కొన్నింటిపై కోర్టు కేసులు వేసి మరికొన్నింటిని చూసీచూడనట్టు వదిలేయడంతో చాలావరకు వ్యాపారులు ఈ భూములలో పాతుకుపోయారు. తరువాత ఒకటో రెండో నిర్మాణాలను మాత్రమే కూల్చగలిగినా పదుల సంఖ్యలో భవనాలు ప్రస్తుతం ఈ లంగర్‌ఖానా భూముల్లో ఉన్నాయి.

క్లుప్తంగా

రాస పోలమాంబకు బెల్లం దిమ్మెలతో అలంకరణ



ప్రత్యేక అలంకరణలో రాస పోలమాంబ

తగరపువలస: భీమిలి మండలం మజ్జివలస గ్రామదేవత రాస పోలమాంబ అమ్మవారిని ఆలయ కమిటీ ప్రతినిధులు మంగళవారం బంతి పువ్వులు, తులసి మాలలు, బెల్లం దిమ్మెలతో అలంకరించారు. పెద్ద మొత్తంలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు. కృష్ణంరాజుపేటకు చెందిన డప్పు కృష్ణ, కార్తీక్ అలంకరణకు సహాయ సహకారాలు అందించారు. మజ్జివలసకు చెందిన తుపాకుల అప్పల రాసయ్య, రాసమ్మ దంపతులు ప్రసాదాలు పంపిణీ చేశారు.

భీమిలి సబ్ రిజిస్ట్రార్ బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరించిన సబ్ రిజిస్ట్రార్ హర్షవర్థన్

భీమునిపట్నం: భీమిలి సబ్ రిజిస్ట్రార్‌గా హర్షవర్ధన్ రెడ్డి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన నర్సీపట్నం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఇక్కడ పని చేసిన తులసీదాస్ శ్రీకాకుళం జిల్లా రణస్థలానికి బదిలీ అయ్యారు. హర్షవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ నిబంధనలకు అనుగుణంగా విధులు నిర్వర్తిస్తానన్నారు.

'తిరుమలలో రాజకీయ ప్రమేయాన్ని నిరోధించాలి'

తగరపువలస: తిరుమల క్షేత్రంలో రాజకీయ ప్రమేయాన్ని నిరోధించాలని కోరుతూ నగరానికి చెందిన సామాజిక కార్యకర్త గొనప అప్పన్న టీటీడీ ఈవోకు మంగళవారం ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేశారు. తిరుమల శ్రీవారికి సంబంధించిన విధాన నిర్ణయాలలో రాజకీయ జోక్యాన్ని నిరోధించాలని కోరారు. ఇటీవల తిరుమల చుట్టూ జరుగుతున్న వివిధ పరిణామాలు కోట్లాది భక్తుల మనోవేదనకు కారణమయ్యాయన్నారు. మితిమీరిన రాజకీయ జోక్యం కారణంగానే తిరుమల ప్రాశస్త్యం మసక బారుతున్నందున, ప్రక్షాళన చేపట్టాలని కోరారు.

తహసీల్దార్ కార్యాలయంలో 10మంది బదిలీ

పద్మనాభం: తహసీల్దార్ కార్యాలయంలో పది మంది బదిలీ అయ్యారు. ఇక్కడ డీటీగా పనిచేసిన నియోగికి విశాఖపట్నం కలెక్టరేట్‌కు బదిలీ అయింది. ఆర్‌ఐ కోటేశ్వరరావు సివిల్ సప్లై చెకింగ్ ఆఫీసర్‌గా సర్కిల్–1కు బదిలీ అయ్యారు. ఆనందపురం నుంచి డిప్యుటేషన్‌పై వచ్చి విధులు నిర్వహిస్తున్న సీనియర్ అసిస్టెంట్ శివప్రసాద్‌కు పెందుర్తి తహసీల్దార్ కార్యాలయానికి బదిలీ అయ్యారు. ఏడుగురు వీఆర్వోలు బదిలీ అయ్యారు.

హైస్కూల్‌కు మొక్కలు అందించిన ఎస్‌బీఐ సిబ్బంది



చిప్పాడ హైస్కూల్‌కు మొక్కలు అందిస్తున్న చిట్టివలస ఎస్‌బీఐ సిబ్బంది

తగరపువలస: స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా, చిట్టివలస బ్రాంచ్ సిబ్బంది మంగళవారం భీమిలి మండలం చిప్పాడ జెడ్పీ హైస్కూల్‌కు నేరేడు, ఉసిరి, కానుగ, తురాయి, సపోటా, చింత, పనస తదితర వంద మొక్కలు అందించారు. వీటిని మాజీ సైనికులు, ఉపాధ్యాయులు కలిసి ఆవరణలో నాటారు. కార్యక్రమంలో బ్రాంచ్ సీనియర్ మేనేజర్ శ్రీనివాసరావు, మాజీ సైనికులు సరగడ సూరిబాబు, కొసన చిట్టిబాబు, ఎరుసు అప్పలరెడ్డి, ఎస్.చిట్టిబాబు, ప్రధానోపాధ్యాయిని ఎం.వి.టి.రత్నం తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా క్రీడా పోటీలు

హోరాహోరీగా తలపడిన విద్యార్థినులు



కబడ్డీ ఆడుతున్న బాలికలు



చిట్టివలస జెడ్పీ హైస్కూల్‌లో ఖోఖో ఆడుతున్న విద్యార్థినులు

తగరపువలస: చిట్టివలస జెడ్పీ హైస్కూల్‌లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రెండు రోజులుగా జరుగుతున్న మండలస్థాయి ఆటల పోటీలకు మొత్తం 400 మంది విద్యార్థులు హాజరయ్యారు. 28 పాఠశాలలకు చెందిన అండర్–14, 17 బాలబాలికల కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, చెస్, యోగా పోటీల్లో సోమవారం 250 మంది బాలురు పాల్గొనగా, మంగళవారం 150 మంది బాలికలు పాల్గొన్నారు. రెండోరోజు జరిగిన ఆటల పోటీల్లో బాలికలు హోరాహోరీగా తలపడ్డారు. చివరిరోజైన బుధవారం బాలిబాలికలకు అథ్లెటిక్స్ నిర్వహించనున్నారు. ఈ పోటీలను ప్రధానోపాధ్యాయుడు పి.మురళీమోహనరావు, జిల్లా వ్యాయామ సంఘం ప్రధాన కార్యదర్శి ఎస్.లలిత్‌కుమార్, మండల కార్యదర్శి చిల్ల వెంకటరెడ్డి తదితరులు పర్యవేక్షించారు.

కేజీబీవీలో..

పద్మనాభం: క్రీడలతో మానసికోల్లాసం పెంపొందించుకోవచ్చని ఎంపీపీ కంటుబోతు రాంబాబు అన్నారు. మండలంలోని కృష్ణాపురంలోని కస్తూర్బా విద్యాలయంలో మంగళవారం ఎస్‌జీఎఫ్ మండల స్థాయి బాలికల క్రీడా పోటీలను జెడ్పీ వైస్ చైర్మన్ సుంకర గిరిబాబుతో కలిసి ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కశిరెడ్డి దామోదరరావు, ఎంఈవోలు పి.రమణ, ఎస్.డి.బాబూలాల్, హైస్కూల్ హెచ్‌ఎంలు ఎం.సన్యాసిరావు, ఆర్.వి.గిరి, ఎస్‌జీఎఫ్ మండల కో–ఆర్డినేటర్ ఎల్.వి.వి.ఆర్.సత్యం, పీడీలు పాల్గొన్నారు.

యథావిధిగా శరన్నవరాత్రి ఉత్సవాలు

తగరపువలస: భీమిలి మండలం తాటితూరు కూడలిలో శరన్నవరాత్రి ఉత్సవాల నిర్వహణకు అభ్యంతరం లేదని పంచాయతీ పాలకవర్గం తెలియజేసింది. దశాబ్దాలుగా ఈ కూడలిలో రెండు వేర్వేరు వర్గాలు ఉత్సవాలు చేస్తున్నాయని, పంచాయతీ మొత్తం ఈ ఉత్సవాల నిర్వహణకు అనుకూలంగా ఉందని తెలిపారు. ఇప్పటికే శాలివాహన సంఘం ప్రతినిధులకు నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ ఇచ్చామని, రెడ్డి సామాజిక వర్గానికి కూడా ఈ సర్టిఫికెట్ ఇస్తామని చెప్పారు. ప్రజలకు ఇబ్బంది కలగకుండా రోడ్డు మార్గాన్ని వదిలేస్తామన్నారు. మాజీ ఉప సర్పంచ్ పతివాడ రాంబాబు మాట్లాడుతూ ఎవరో ఒక టీడీపీ నాయకుడు అభ్యంతరం చెప్తే, అది పార్టీకి సంబంధం లేదన్నారు. అది అతని వ్యక్తిగత అభిప్రాయమన్నారు.

మమ అనిపించేశారు

కొమ్మాది: కూటమి ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు పూర్తయిన సందర్భంగా జీవీఎంసీ 4వ వార్డు కాపులుప్పాడలో నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని నామమాత్రంగా నిర్వహించారు. ఉదయం 10 గంటలకు వస్తారన్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు మధ్యాహ్నం 12 గంటలకు రావడంతో ప్రజలు అసహనం వ్యక్తం చేశారు. తీరా ప్రజలు రెండు గంటలకు పైగా నిరీక్షిస్తే.. ఎమ్మెల్యే స్టేజ్‌పై 10 నిమిషాలు మాట్లాడి వెళ్లిపోయారు. దీంతో కార్యక్రమం నిర్వహించిన ప్రతీ చోట ఇలాగే జరుగుతోందని నాయకులు నిరాశ చెందుతున్నారు. మరోవైపు దీనిని ప్రభుత్వ కార్యక్రమంగా చేపడుతున్న నేపథ్యంలో జన సమీకరణకు అధికారులు తలలు పట్టుకుంటున్నారు. ఏదో విధంగా జనాలను సమకూర్చి, అన్ని ఏర్పాట్లు చేస్తుంటే ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు పది నిమిషాల్లోనే మమ అనిపించేసి, నాయకులకు కనీసం మాట్లాడే అవకాశం కూడా ఇవ్వకపోవడంతో నిరాశతో వెనుదిరుగుతున్నారు.

ప్రభుత్వ స్థలంలో ఆక్రమణల తొలగింపు



పొక్లెయిన్ ద్వారా ఆక్రమణలు తొలగిస్తున్న దృశ్యం

కొమ్మాది: జీవీఎంసీ 4వ వార్డు తిమ్మాపురంలో సర్వే నంబరు 314లోని ప్రభుత్వ స్థలంలో అనధికారిక నిర్మాణాలను అధికారులు మంగళవారం తొలగించారు. టీడీపీకి చెందిన ఓ నాయకుడు ప్రభుత్వ భూములను ప్లాట్లుగా వేసి, అమ్మకాలు చేస్తున్న నేపథ్యంలో స్థానికులు తహసీల్దార్ పైలా రామారావుకు వరుస ఫిర్యాదులు చేశారు. దీనిపై స్పందించిన ఆయన అధికారుల ఆధ్వర్యంలో ఆక్రమణలు తొలగించారు. అదే విధంగా ఇదే ప్రాంతంలో మరి కొన్ని ఆక్రమణలు జరుగుతున్నాయని, వీటిని కూడా పరిశీలించి త్వరలో స్వాధీనం చేసుకుని హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తామని అధికారులు తెలిపారు.

విద్యార్థులు ఎన్‌ఎస్‌ఎస్‌లో చేరాలి



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

భీమునిపట్నం: విద్యార్థులు ఎన్ఎస్ఎస్‌లో చేరి, సమాజానికి సేవలందించాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్.విష్ణుమూర్తి అన్నారు. ఎన్ఎస్ఎస్ దినోత్సవం సందర్భంగా మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఆయన మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్‌లో చేరడం వల్ల సమాజానికి అవసరమైన ఎన్నో కార్యక్రమాలను చేయడానికి వీలుంటుందన్నారు. దీనివల్ల పలువురికి మంచి జరుగుతుందని, విద్యార్థులు కూడా ఉత్తమ పౌరులుగా గుర్తింపు పొందుతారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు డాక్టర్ ఎస్.అప్పలనాయుడు, ఎస్.శ్రీను, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపునకు వినతి

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు రుషికొండలోని గెడ్డ స్థలంలో ఆక్రమణలు తొలగించాలని స్థానికులు రూరల్ తహసీల్దార్ పాల్ కిరణ్‌కు ఫిర్యాదు చేశారు. ఈ గెడ్డ ఆక్రమణల వలన మురుగు నీరు నిలిచి దుర్గంధం వస్తోందని, పారిశుధ్య సమస్యతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని పేర్కొన్నారు.

పార్కుల్లో ఆటలాడేదెలా?



ఊయల లేకుండా ఏర్పాటు చేసిన పైపులు



సీట్లు లేని రౌండ్ స్టాండ్

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ ఒకటోవార్డు కొండపేట కొండపై పార్కులో రెండు నెలల క్రితం చిన్నారులకు ఆటవస్తువులు ఏర్పాటు చేశారు. వాటిలో కొన్ని అసంపూర్తిగా ఉన్నాయి. ముఖ్యంగా పిల్లలు ఉత్సాహంగా ముందుకు వచ్చే ఊయలలు లేకుండా కేవలం పైపులతో స్టాండ్ వేసి వదిలేశారు. అలాగే చిన్నారులు రౌండ్ స్టాండ్‌పై కూర్చుని చుట్టూ తిరిగేలా ఉన్న పరికరంపై సీట్లు వేయడం మరచిపోయారు. దీంతో సాయంత్రం వేళ పార్కుకు వచ్చే చిన్నారులకు ఆటలాడుకోవడానికి పూర్తిస్థాయిలో సౌకర్యాలు లేకపోడంతో అసంతృప్తితో వెనుదిరుగుతున్నారు. జీవీఎంసీ అధికారులు అసంపూర్తిగా వదిలేసిన పరికరాలను పూర్తి చేయాలని ఈ ప్రాంత చిన్నారులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

వ్యవసాయంలో యాంత్రీకరణతో అధిక దిగుబడులు



వేములవలసలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో వ్యవసాయాధికారులు, రైతులు



మజ్జిపేటలో ..

తగరపువలస: వ్యవసాయంలో యాంత్రీకరణ ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని జిల్లా వ్యవసాయాధికారి కొత్తూరు అప్పలస్వామి అన్నారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా ఆనందపురం మండలం వేములవలస, వెల్లంకిలో ఏపీఎంఐపీ పీడీ ఎం.మన్మధరావుతో కలసి ఆయన పర్యటించారు. రైతులకు డ్రిప్, స్ప్రింక్లర్ల గురించి వివరించారు. ఈ యంత్రాలు కావలసిన వారు రైతుసేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. షేడ్‌నెట్స్ ఉపయోగించి రైతుల అధిక ఆదాయం పొందాలని జిల్లా ఉద్యానవన అధికారి కె.సత్యనారాయణరెడ్డి తెలిపారు. ఏవో చావా సంధ్యారత్న ప్రభ, శ్రీనివాస చక్రవర్తి రైతులకు సూచనలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు ఉప్పాడ లక్ష్మణరావు, కె.శ్రీనివాసరావు, ఎంపీటీసీ పడాల అప్పలనాయుడు పాల్గొన్నారు.

- భీమిలి మండలం మజ్జిపేట, శింగనబంద పంచాయతీలలో జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఏడీఈ విజయప్రసాద్, డీఆర్సీ ఏడీఏ సుబ్రహ్మణ్యం, డీపీఎం మోహనరావు, ఏవో బి.శివకోమలి పాల్గొని రైతులకు సూచనలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు మజ్జి సూరినాయుడు, గాడు వెంకటనారాయణ, మజ్జి వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

అధికారుల సూచనలు పాటించాలి

పద్మనాభం: వ్యవసాయ శాఖ అధికారుల సలహాలు, వారు సూచించిన జాగ్రత్తలు పాటిస్తే పంటల అధిక దిగుబడి సాధించవచ్చని ఎంపీపీ కంటుబోతు రాంబాబు అన్నారు. మండలంలోని మద్దిలో మంగళవారం నిర్వహించిన పొలం బడిలో ఆయన మాట్లాడారు. చోడి పంటను సాగు చేస్తే తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయం పొందవచ్చని తెలిపారు. భీమునిపట్నం సబ్ డివిజన్ వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ బి.విజయప్రసాద్ మాట్లాడుతూ వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులు ప్రతి మంగళ, బుధవారాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహిస్తున్నారన్నారు. క్షేత్ర స్థాయిలో పంటలను పరిశీలించి రైతులకు సలహాలు, సూచనలు ఇస్తారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు బుగత సత్యనారాయణ, ఏవో ఎంపీఎస్ చలం, పద్మనాభం పశు వైద్యాధికారి మహేష్, ఉద్యానవనశాఖ అధికారి స్వాతి తదితరులు పాల్గొన్నారు.

జోన్–3 విద్యుత్ శాఖలో బదిలీలు

మధురవాడ: మధురవాడ జోన్–3 ఏపీఈపీడీసీఎల్‌లో పలువురు ఉద్యోగులు మంగళవారం బదిలీ అయ్యారు. మధురవాడ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎ.అనిల్ కుమార్ సింహాచలం మీటర్స్ సెక్షన్‌కు బదిలీ కావడంతో ఆయన స్థానంలో టి.కిరణ్ కుమార్ (ఆనందపురం) రానున్నారు. డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్.రాజశేఖర్ ఆనందపురం బదిలీ అయ్యారు. మధురవాడ ఉప విద్యుత్ కేంద్రం ఏఈఈ ఎస్‌వీఎస్ రామమూర్తి సిరిపురానికి బదిలీ కాగా ఆయన స్థానంలో జిల్లా కార్యాలయ సూపరింటెండెంట్ విభాగం నుంచి శైలజ రానున్నారు. సాగర్ నగర్ ఉపవిద్యుత్ కేంద్రం నుంచి ఏఈఈ ఎం.రాజేష్ మురళీ నగర్‌కు బదిలీ కాగా ఆయన స్థానంలోకి సిరిపురం నుండి ఎస్.చక్రవర్తి వచ్చారు.

రెండు నెలలుగా జీతాల్లేవ్

పాఠశాలల్లో పని చేస్తున్న శానిటేషన్ సిబ్బంది ఆవేదన




విద్యాశాఖ మంత్రి లోకేష్‌కు సమస్యలు వివరిస్తున్న చంద్రంపాలెం హైస్కూల్ ఆయాలు (ఫైల్)

మధురవాడ: ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న శానిటేషన్ సిబ్బంది(ఆయాలు)కి రెండు నెలలుగా జీతాలు లేవు. వీరికిచ్చే నామమాత్రపు వేతనాలు కూడా సక్రమంగా ఇవ్వకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. ఈ విద్యా సంవత్సరం మే, జూన్‌లో సగం జీతం ఇచ్చారు. జూలై, ఆగస్టులో పూర్తిగా జీతాలు చెల్లించలేదు. భీమిలి, విశాఖ తూర్పు, విశాఖ ఉత్తర నియోజకవర్గాల పరిధిలో విస్తరించి ఉన్న విశాఖ రూరల్ మండలంలో 63 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. ఇందులో 10 హైస్కూళ్లు, రెండు ప్రాథమిక పాఠశాలలు ఉండగా.. మొత్తంగా 108 మంది ఆయాలు విధులు నిర్వహిస్తున్నారు. కొన్ని పాఠశాలల్లో ఒక్కరే ఉన్నారు. వీరు మరుగుదొడ్లు, పాఠశాల పరిసరాలన్నీ శుభ్రం చేయాల్సి ఉంటుంది. రోజంతా పనిచేస్తే వీరికి చెల్లించేది నెలకు రూ.6 వేలు. అది కూడా ప్రతి నెలా సక్రమంగా చెల్లించకపోతే ఎలా అని వీరంతా ప్రశ్నిస్తున్నారు. గత నెలలో విశాఖ వచ్చిన మంత్రి లోకేష్‌ను చంద్రంపాలెం హైస్కూల్‌లో కలిసి తమ సమస్యను చెప్పుకున్నారు. తక్షణమే చర్యలు చేపడతామని మంత్రి హామీ ఇచ్చినా.. ఇప్పటికీ జీతాలు చెల్లించలేదు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి జీతాల బకాయిలు చెల్లించాలని వారంతా విజ్ఞప్తి చేస్తున్నారు.

తాగునీరు కలుషితం

- పంప్‌హౌస్ సమీపంలో పేరుకుపోతున్న వ్యర్థాలు
- తరచూ అనారోగ్యం పాలవుతున్న యాతపేట, చిన్నిపేట గ్రామస్తులు
- గెడ్డల్లో వ్యర్థాలు తొలగించాలని విన్నపాలు



యాతపేట వద్ద గెడ్డలో గడ్డ కట్టుకుపోయిన వ్యర్థాలు




జాతీయ రహదారి అవతలివైపు పూడుకుపోయిన గెడ్డ



వ్యర్థాలకు 30 అడుగుల దూరంలో పంప్‌హౌస్, బోరుబావి

తగరపువలస: భీమిలి మండలం తాళ్లవలస పంచాయతీలోని ఎస్సీ కాలనీ, యాతపేట, చిన్నిపేట గ్రామాలు కాలుష్యం అంచున కొట్టుమిట్టాడుతున్నాయి. యాతపేట రోడ్డులో ప్రముఖ కార్పొరేట్ విద్యాసంస్థ నుంచి విడుదల అవుతున్న వ్యర్థాలు జాతీయరహదారిని ఆనుకుని గడ్డ కట్టుకుపోయాయి. దీనికి 30 అడుగుల దూరంలోనే ఆయా గ్రామాలకు తాగునీరు అందించే పంప్‌హౌస్, బోరుబావి ఉండటం వలన తాగునీరు కలుషితం అవుతోంది. దీంతో ఆయా గ్రామాల ప్రజలు తరచూ ఆసుపత్రుల పాలవుతున్నారు. యాతపేట మొదలుకుని జాతీయరహదారి దిగువ నుంచి తాళ్లవలస చెరువు వరకు గెడ్డ మొత్తం పూడుకుపోయింది. గెడ్డ పొడవునా తుప్పలు, వ్యర్థాల డంప్ కారణంగా ఈ ప్రాంతమంతా ముక్కుపుటాలు అదిరేలా దుర్గంధం వ్యాపిస్తోందని స్థానికులు వాపోతున్నారు. గెడ్డ మొత్తం పూడిక తొలగించి, వ్యర్థాలు చెరువులోకి చేరేలా చేయకపోతే పంప్‌హౌస్ వద్ద తాగునీరు కలుషితమై ఆయా గ్రామాల ప్రజలు మరిన్ని వ్యాధుల బారిన చిక్కే ప్రమాదం ఉందని అంటున్నారు. స్థానిక పీహెచ్‌సీ ప్రధాన వైద్యుడు ఏబీ మల్లికార్జునరావు మాట్లాడుతూ మంగళవారం ఇంటింటా జ్వరాల తనిఖీ చేపట్టి, అవసరమైన వారికి మందులు పంపిణీ చేస్తామన్నారు.



పూడుకుపోయిన గెడ్డ

తహసీల్దార్ కార్యాలయంలో తనిఖీలు

తగరపువలస: ఆనందపురం తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం వీఎంఆర్డీఏ డిప్యూటీ కలెక్టర్లు కీర్తి, లక్ష్మారెడ్డి, విశాఖ ఆర్డీవో హుస్సేన్ సాహెబ్ ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. కలెక్టరేట్‌కు వచ్చిన వినతులపై మండలంలోని భూములు ప్రభుత్వ నిబంధనల ప్రకారం సర్వే చేశారా? లేదా? అని ఆరా తీశారు. గండిగుండం రెవెన్యూ పరిధిలో వివరాలు సేకరించారు. తహసీల్దార్ పి.శ్యామ్‌ప్రసాద్, డిప్యూటీ తహసీల్దార్ రాజేష్ తదితరులు వీరికి సహకరించారు.

ఆనందపురం ఎంపీడీవోగా జానకి

తగరపువలస: ఆనందపురం ఎంపీడీవో ఎస్.జానకి భీమిలి నుంచి మంగళవారం బదిలీపై వచ్చారు. ఇక్కడ ఎంపీడీవోగా పనిచేసిన లవరాజు అరకులోయ మండలానికి బదిలీపై వెళ్లారు.

బ్యూటీ థెరపిస్ట్ కోర్సులో ఉచిత శిక్షణ

భీమునిపట్నం: భీమిలి పాలిటెక్నిక్ కళాశాలలో బ్యూటీ థెరపిస్ట్ కోర్సులో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్.మురళీకృష్ణ మంగళవారం తెలిపారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఈ శిక్షణను అందిస్తున్నట్లు పేర్కొన్నారు. పదో తరగతిలో ఉత్తీర్ణత సాధించి, 35 సంవత్సరాల వయసులోపు ఉన్న మహిళలు ఈ శిక్షణకు అర్హులని పేర్కొన్నారు. ఇతర వివరాలకు కార్యక్రమం కో–ఆర్డినేటర్ అన్నపూర్ణను 9014758949 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

పోషకాహారంతో ఆరోగ్యకర సమాజం

కొమ్మాది: పోషకాహారంతో ఆరోగ్యకర సమాజ నిర్మాణం సాధ్యమని గీతం ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ వై.గౌతమ్‌రావు అన్నారు. గీతం సెంటర్ ఫర్ హెల్త్ అండ్ వెల్‌నెస్ ఇన్నోవేషన్స్ మహిళా సాధికారిక విభాగం, గీతం స్కూల్ సైన్స్ జీవశాస్త్ర విభాగం, జిమ్‌సర్ సామాజిక వైద్య విభాగం సంయుక్తంగా నిర్వహించిన జాతీయ పోషకాహార కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. జంక్ ఫుడ్ స్థానంలో సూక్ష్మ పోషకాలు, చిరుధాన్యాలతో తయారైన వివిధ ఆహార పదార్థాలను రోజువారీ జీవితంలో తప్పనిసరిగా వినియోగించడం ఆరోగ్యానికి మంచిదని పేర్కొన్నారు.